ఐక్యతకు సూచికలు.. వన సమారాధనలు


దేచుపాలెంలో మాట్లాడుతున్న విప్ సామినేని ఉదయభాను


నందిగామలో మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్


దేచుపాలెంలో వనసమారాధనకు హాజరైన జనం

వత్సవాయి(పెనుగంచిప్రోలు): పవిత్ర కార్తికమాసం చివరి ఆదివారం కావడంతో వన సమారాధనలతో జనం సందడి చేశారు. భారీగా తరలివచ్చిన జనాలతో మామిడితోటలు కళకళలాడాయి. వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామంలో శ్రీకృష్ణ దేవరాయ సేవాసమితి(కాపుసంఘం)ఆధ్వర్యంలో వనసమారాధనను నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వనసమారాధనలు ఐక్యతను చాటుతాయని వివరించారు. వనసమారాధనలో భాగంగా తొలుత ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్, విమలాభాను, శ్రీకృష్ణదేవ రాయ సేవాసమితి అధ్యక్షుడు యలమంచలి రాజేంద్రప్రసాద్, ప్రధానకార్యదర్శి ముల్యాల శేషు, కోశాధికారి కామిశెట్టి అమరనాథ్, గౌరవాధ్యక్షుడు గోగుశెట్టి మహేష్, విజయవాడకు చెందిన ఆకుల శ్రీనివాస్, బొమ్మదేవర సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, న్యాయవాది పసుపులేటి సత్యశ్రీనివాస్, సామినేని రాము, బుల్లిబాబు, జీవీడీ ప్రసాద్, కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలులో కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం జరిగింది. తొలుత పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, దెందులూరు మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు.

నందిగామలో..

నందిగామ: కార్తీకమాసం ఆఖరి ఆదివారం కావడంతో నందిగామ పట్టణ శివారులోని మామిడి తోటలు సందడిగా కనిపించాయి. కమ్మ సామాజిక వర్గీయులు పట్టణంలోని స్థానిక కమ్మ కల్యాణమండపంలో వనసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సామాజికవర్గానికి చెందిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా మున్నేటి తీరాన మామిడితోటల్లో కాపు, కృష్ణ బలిజ సామాజికవర్గాలతోపాటు పలు విద్యాసంస్థలకు చెందినవారు వన సమారాధన కార్యక్రమాలకు తరలివచ్చారు. సాయంత్రం సమయంలో మున్నేటి తీరం వన సమారాధనకు వచ్చిన వారితో సందడిగా కనిపించింది.


ఉసిరిచెట్టుకు పూజలు చేసిన మహిళలు

శ్రీతిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


వెండిని అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి దంపతులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సెలవుదినంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారికి కిలో వెండి బహుకరణ

శ్రీతిరుపతమ్మవారికి హైదరాబాద్ పద్మానగర్‌కు చెందిన గడ్డం రాజేందర్‌రెడ్డి, స్వాతికారెడ్డి దంపతులు కిలో వెండిని బహూకరించారు. ఈ మేరకు ఏఈఓ తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

త్వరలో టిడ్కో గృహాల పంపిణీ

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహాలను త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. టిడ్కో గృహసముదాయం వద్ద యుద్ధప్రాతిపదికన జరుగుతున్న విద్యుదీకరణ, పెయింటింగ్, టెయిల్స్ నిర్మాణం, పంబ్లింగ్, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల వలన టిడ్కో గృహాల పంపిణీలో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుందన్నారు. గృహాల కోసం స్థలాలు ఇచ్చిన రైతులు, టిడ్కో గృహాల నిర్మాణ పనులు చేపట్టిన సంస్థకు ఇవ్వాల్సిన డబ్బులను గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులతో పాటు నిర్మాణ సంస్థకు డబ్బులు చెల్లించి పనులు తిరిగి ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు గృహాలను పంపిణీ చేస్తామని వివరించారు.


టిడ్కో ఇళ్ల వద్ద డ్రెయిన్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉదయభాను

రోడ్డు అప్రోచ్ పనుల పరిశీలన..

స్థానిక బలుసుపాడు రోడ్డులోని జగనన్న కాలనీ కోసం ఏర్పాటుచేసిన ఎల్‌పీ-1, ఎల్‌పీ-2తో పాటు కొత్తగా మరికొన్ని గృహాల నిర్మాణం కోసం ఎల్‌పీ-3 ఏర్పాటుచేశామని ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు. కాగా ఎల్‌పీ-3కి వెళ్లేందుకు బలుసుపాడు రోడ్డు నుంచి ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకోసం జరుగుతున్న రోడ్ అప్రోచ్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్ ఉన్నారు.

ఘనంగా చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని జీసస్ గాస్పల్ చర్చ్, అసూరెన్స్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రార్థనా మందిరంలో చిన్నారుల ఆటపాటలు, నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవాజీ సామ్యూల్, నేలపాటి సుజన్, ఆదిరాల అభిషేక్‌లు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తు సర్వ మానవాళిని రక్షించేందుకు బాలుడు రూపంలో ఈ లోకానికి విచ్చేశారని, ప్రతి చిన్నారిలోనూ ఏసుక్రీస్తును చూడాలని దివ్య సందేశాన్ని అందించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చిన్నారులకు నూతన వస్త్రాలను బహుకరించారు. కార్యక్రమంలో బిషప్ నేలపాటి జీవన్‌పాల్, జీసస్ గాస్పల్ చర్చి వ్యవస్థాపకులు నేలపాటి సుజాత జీవన్‌పాల్, పాస్టర్ సత్యవేణి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

వాహనాల తనిఖీ

వీరులపాడు: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మహాలక్ష్మణుడు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తమ వాహనాల్లో పరిమిత సంఖ్యలోనే ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఆదేశించారు.

నేడు కోటి దీపోత్సవం

నందిగామ: పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలి వాసవి మార్కెట్‌లో సోమవారం సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహించనున్నటులగణపతి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు సూచించారు.

అర్జీలు అందజేస్తే పరిష్కరిస్తాం

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పబ్బారి శంకరబాబు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందజేయవచ్చని ఆయన సూచించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



చందర్లపాడు(నందిగామ): తుపాను కారణంగా చందర్లపాడు మండలంలోని బొబ్బిళ్ళపాడు, కోనయపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న మిరప పంటలను జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బాలాజీకుమార్ ఆదివారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా బాలాజీకుమార్ మాట్లాడుతూ మిరప పంట సాగుచేస్తున్న రైతులు ఉద్యానవనశాఖ సూచనలను పాటించి, తగు మోతాదులో అవసరమైన మందులు పిచికారీ చేయడం ద్వారా వర్షం వల్ల దెబ్బతిన్న పంటను రక్షించుకోవచ్చన్నారు. విచక్షణారహితంగా ఎరువులు వినియోగించవద్దని, ఉద్యానవన అధికారుల సూచనల ప్రకారమే వినియోగించాలని సూచించారు. ఆయన వెంట స్థానిక ఉద్యానవనశాఖ అధికారి నీలిమ ఉన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పట్టణ పోలీసు ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హనీష్ మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో పి.సాయిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ విద్యార్థుల ప్రదర్శనలు



కొణకంచి(పెనుగంచిప్రోలు): గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం పెనుగంచిప్రోలు మండలంలోని కొణకంచిలో ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి. గ్రామంలో పండించే పంటలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పంటల మద్దతు ధరల వివరాలను ముగ్గుల రూపంలో గీసి రైతులకు వివరించారు.

ప్రతిరైతును ఆదుకుంటాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన ప్రతిఒక్క రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. తుపాను కారణంగా మండలంలోని కొణతాలపల్లి, జయంతి గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పంట నష్టం అంచనాలను సిద్ధం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఇప్పటికే మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక కమిటీ పూర్తిస్థాయిలో పంట పొలాలను పరిశీలించి పంటనష్టం అంచనాలను నమోదు చేయనున్నట్లు వివరించారు. ఈమేరకు నందిగామ నియోజకవర్గంలోని రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. జాబితాను రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీల నిమిత్తం ప్రదర్శించిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తారని చెప్పారు. వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పంటనష్టపోయిన రైతులందరికీ తప్పనిసరిగా పరిహారం అందుతుందన్నారు. ఎవ్వరూ అధైర్యపడవద్దని, తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్‌లు నంద్రు సౌజన్య, మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణరెడ్డి, అయిలూరి వెంకట్రావమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, ఉపసర్పంచ్ అయిలూరి నర్సిరెడ్డి, గాంధీ, నాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


జయంతిలో గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పూర్తిస్థాయి పంటనష్టం అంచనాకు కసరత్తు

కంచికచర్ల : తుపాను కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పంట పొలాల్లో వరదనీరు తగ్గినందున పంటనష్టాన్ని అంచనా వేయనున్నారు. నందిగామ నియోజకవర్గంలో సుమారు 45వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, ఇతర ఉద్యానపంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని పారదర్శకంగా అంచనా వేసి బాధిత రైతులకు పరిహారం అందేలా చూడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీచేయడంతో అధికారులు ఆమేరకు చర్యలు చేపట్టారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఇప్పటికే ఆయా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతోపాటు రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని ఆదేశించడంతో పంటనష్టం లెక్కలను పక్కాగా తేల్చేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలుచేసి బాధిత రైతులకు అండగా ఉంటామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించడంతో నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నష్టం అంచనా కమిటీలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో పంటనష్టంపై మూడురోజుల్లో పూర్తిస్థాయి అంచనాలను రూపొందించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు కంచికచర్ల ఏవో కె.విజయకుమార్ తెలిపారు.


నేలకొరిగిన కంది పంట

మంచు కురిసేవేళలో..


మంచుతో నిండిన గాంధీ సెంటర్


హైవేపై లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనచోదకులు

నందిగామ: నందిగామ ప్రాంతాన్ని ఆదివారం పొగమంచు కమ్మేసింది. వేకువజాము నుంచే ప్రారంభమైన పొగమంచు ఉదయం తొమ్మిది గంటల వరకు కొనసాగింది. మంచు బిందువులు వర్షపు చినుకులను తలపించాయి. ఎదుటివారు సైతం కనిపించనంత దట్టంగా పేరుకుపోయిన పొగమంచుతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. ముఖ్యంగా హైవేపై వాహనాలు ఉదయం వేళ సైతం లైట్ల వెలుగులో ప్రయాణించాల్సి వచ్చింది. ఇలా మంచుకురవడం ప్రకృతి ప్రేమికులకు మాత్రం కనువిందు చేసింది.

క్లుప్తంగా

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. పూజల అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. కెడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దులమ్మకు పొంగళ్లు



గొట్టుముక్కల(కంచికచర్ల) : మండలంలోని గొట్టుముక్కల సమీపంలో అడవిలోని కొండపై కొలువైఉన్న ముద్దులమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంత ప్రజలు ట్రాక్టర్లపై ప్రభలు కట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు అమ్మవారికి పూలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న జలపాతం వద్ద భక్తులు సందడి చేశారు.

కనుల పండువగా గ్రామోత్సవం



గౌరవరం(జగ్గయ్యపేట అర్బన్): కార్తికమాసం సందర్భంగా మండలంలోని గౌరవరంలో ఆదివారం శుక శ్యామలాంబ సమేత రాజమల్లేశ్వర స్వామివారి గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. ఆలయంలో శనివారం రాత్రి స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు .

ఘనంగా శ్రీవారి వ్రతాలు



నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్టపైగల కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం సామూహిక వెంకటేశ్వరస్వామి వారి వ్రతాలు నిర్వహించారు. కార్తీకమాస స్వాతినక్షత్రం నేపథ్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం వెంకటేశ్వరస్వామి వారి వ్రతాన్ని నిర్వహించగా, పెద్దసంఖ్యలో దంపతులు హాజరయ్యారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పటమట(విజయవాడతూర్పు): ఇళ్లలోకి చొరబడి వస్తువులను దొంగిలించే వ్యక్తిని స్థానికులు పట్టుకుని పటమట పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున పటమటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన షేక్ మహ్మద్ తరచూ దొంగతనాలకు పాల్పడటం పరిపాటిగా మారింది. శనివారం అర్ధరాత్రి పటమట ఓల్డ్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన పుట్టగుంట సతీష్ ఇంటిలోకి చొరబడి సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. అలికిడి విని కేకలు పెట్టగా మహ్మద్ పారిపోయి భద్రయ్యనగర్‌లోని ఓ చెట్టుపై దాక్కున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికులు గాలించగా చెట్టుపై దాక్కున్న మహ్మద్‌ను పట్టుకున్నారు. ఇదే సమయంలో పశ్చిమ ఏసీపీ హనుమంతరావు నైట్‌రౌండ్స్‌లో విధులు నిర్వహిస్తూ అటువైపు వచ్చి విచారించారు. పటమట క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వచ్చిన మహిళ అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన తుమ్మ తిరుపతమ్మ తన అత్త అంజలితో కలిసి ఈ నెల 7న విజయవాడకు వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోటి కోడలిని చూసేందుకు పాత ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఇద్దరూ కలిసి ఆస్పత్రిలో ఉన్న పేషెంట్‌ను పరామర్శించి బయటకు వచ్చారు. అదే రోజు రాత్రి 9.30 గంటలకు ఆమె అత్త అంజలి ఆస్పత్రి బయట తెలిసిన వారితో మాట్లాడుతుంది. ఆ సమయంలో తిరుపతమ్మ అక్కడ నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం అంజలి వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వైభవంగా కోటి దీపోత్సవం


కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


హాజరైన భక్తులు


కోలాట ప్రదర్శనలో చిన్నారులు


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న నోరి నారాయణమూర్తి

నందిగామ: పట్టణంలోని కెవిఆర్ కళాశాల ఆవరణలో కోటి దీపోత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్నేహ సమాజం సర్వీస్ సొసైటీ, లక్ష్మీగణపతి పీఠం, హిందూ ధార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన ఆదివారం కళాశాల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కోటి దీపోత్సవంలో భాగంగా తొలుత శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ నోరి నారాయణమూర్తి ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళా భక్తులు హాజరై కార్తీకదీపాలను వెలిగించారు.